హైదరాబాద్
ప్రజాశక్తి
12 పేజీలు
బుధవారం 29-5-2013



# సామాజిక చైతన్యం లక్ష్యంగా మనోజ్‌దాస్ రచనలు



జ్ఞాపికతో సత్కరిస్తున్న ప్రముఖులు

**ప్రజాశక్తి - చిక్కడపల్లి**

భాష, ప్రాంతాలలో నిమిత్తం లేకుండా సామాజిక చైతన్యం లక్ష్యంగా మనోజ్‌దాస్ తమ రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నారని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అభినందించారు. మంగళవారం రవీంద్రభారతిలో ఎన్‌టిరామారావు 90వ జయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ విజ్ఞాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రఖ్యాత ఒరియా, ఆంగ్లభాషా రచయిత డాక్టర్ మనోజ్‌దాస్‌కు ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఓట్ల కోసం నాయకులు డబ్బు ఖర్చు చేస్తున్నారని, డబ్బు సంపాదనే లక్ష్యంగా రాజకీయం మారటం వల్ల ప్రజాస్వామ్యం పతనమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తమ గుణాలు గల నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని, ఇందుకు రచయితలు తమ సాహిత్యం ద్వారా ప్రజలను జాగృతం చేయాలని కోరారు. ఎన్‌టిరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి, అదిలాబాద్‌లోని గిరిజన తండా ప్రజలతో కలసి భోంచేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ తాను కూడా ఆయనను కలిశానని తెలిపారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించినప్పుడు ప్రజల నుంచి వచ్చిన తిరుగుబాటు దేశ చరిత్రలోనే అపూర్వమన్నారు. ప్రముఖ కథకులు డాక్టర్ రావూరి. భరద్వాజ మాట్లాడుతూ ఎన్‌టిరామారావు మహానాయకుడేకాదు, గొప్ప సాహిత్యాభిమాని అని వివరించారు. సభాధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర సమితి పొలిట్ బ్యూరో సభ్యులు డాక్టర్ కెవిరమణ మాట్లాడుతూ తెలుగు వారికి గుర్తింపు ఆత్మగౌరవం కల్గించిన ఎన్‌టిఆర్ పార్టీలకు అతీతంగా అప్పటి ప్రధాని పివి నరసింహారావును సత్కరించడం విబేధాలు వచ్చినా, సంయమనంతో ప్రఖ్యాత సంగీతజ్ఞులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణను సన్మానించటం అపూర్వఘట్టమని పేర్కొన్నారు. చిత్తూరు నాగయ్య, ఎంజిఆర్, రాజ్‌కపూర్, ఎన్‌టిఆర్, కృష్ణలు మాత్రమే నటులుగానే కాకుండా నిర్మాతలుగా, దర్శకులుగా వెలుగొందిన వారని వివరించారు. సన్మాన గ్రహీత మనోజ్‌దాస్ పరిచయం చేసిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.మృణాళిని, నాటక రచయిత డాక్టర్ డి.విజయభాస్కర్‌లు ఒరియా మాతృభాషలోనే కాక, ఆంగ్లభాషలోనూ కథ, వ్యాస, విమర్శ, విశ్లేషణ వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన దాస్ అంతర్జాతీయంగా కూడా కథకునిగా గుర్తింపు పొందారని వివరించారు. వివిధ పత్రికల్లో ఆయన భిన్న శీర్షికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి, ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మిపార్వతి ఎన్‌టిఆర్ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం మనోజ్‌దాస్‌ను శాలువామాలలతో సత్కరించగా, లక్ష్మిపార్వతి రూ:50 వేలు బహుకరించగా, జస్టిస్ చంద్రకుమార్ జ్ఞాపిక బహుకరించారు.

**మనోజ్‌దాస్ ఏమన్నారంటే..**

తనకు జరిగి సత్కారానికి కృతజ్ఞతులు తెలుపుతూ ఎన్నో సన్మానాలు అందుకున్న ఇతర భాషా ప్రముఖులు సత్కరించటం గర్వంగా ఉంది. నన్నయ నుంచి ఎందరో గొప్ప సాహితీవేత్తలు తెలుగు సుసంపన్న చేశారు. నాగిరెడ్డి, చక్రపాణి నడిపిన చందమామ సంచిక పదిహేను భాషల్లో ప్రచురింపబడి తెలుగువారి ఖ్యాతిని తెలిపింది. ఆంగ్ల సంచికకు నేను సంపాదకవర్గంలో ఒకరిగా ఉన్నాను. ఆ సమయంలో ఎన్‌టిఆర్ నటించిన పాతాళభైరవి, మాయబజార్ చిత్రాలు చూచి ముగ్ధులైనాను. ప్రస్తుతం దేశ సంక్షోభ సమయంలో ఉన్నాం. రాజకీయాలు ధన సంపాదనకు వ్యాపారంగా మారాయి. విద్యావంతులు పలు కుంభకోణాల్లో ఇరుక్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని గాడిలోపెట్టె బాధ్యత ప్రతివారిపై ఉంది.